# సాక్షి జగిత్యాల

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024






**కోతులు.. చిలుకలు.. పందులు**

మొక్కజొన్న పంటను కోతులు, అడవిపందు లు, రామచిలుకల నుంచి కాపాడటం రైతులకు సవాల్‌గా మారింది. 8లో▸



**ఎస్జీఎఫ్‌కు నిధుల కొరత**

ఏటా జిల్లాల్లో నిర్వహించే ఎస్జీఎఫ్‌ అసోసియేషన్ క్రీడలను అత్తెసరు నిధులతో నెట్టుకురావాల్సిన దుస్థితి నెలకొంది. క్రీడాకారులు భోజనానికీ ఇబ్బంది పడుతున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0/22.0

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఈదురుగాలులు కొనసాగుతాయి.

## ‘స్థానికం’ గెలవండి.. టికెట్‌ పొందండి!

- అన్నిచోట్ల విజయం సాధించాలి
- ఉమ్మడి జిల్లా నేతలకు కాంగ్రెస్‌ పెద్దల స్పష్టీకరణ
- కరీంనగర్‌ సీపీ, సిరిసిల్ల ఎస్పీలపై పీసీసీ చీఫ్‌కు ఎమ్మెల్యేల ఫిర్యాదు
- సమావేశ జాబితాలో పేరు లేకపోవడంపై అలిగిన జీవన్‌రెడ్డి
- రుణమాఫీ, రేషన్‌ కార్డుల ప్రక్రియ వేగిరం చేయాలన్న ‘అడ్లూరి’
- కార్పొరేషన్లను గెలుస్తామని మంత్రులు దుద్దిళ్ల, పొన్నం ధీమా
- వరుస పర్యటనలకు మంత్రుల కసరత్తు!



ఇటీవల ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశమైన దీపాదాస్‌ మున్షీ, మహేశ్‌కుమార్‌గౌడ్‌

సాక్షి ప్రతినిధి, కరీంనగర్‌:

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతీచోట పార్టీ విజయం సాధించాలని.. అలాగైతేనే మరోసారి టికెట్‌ దక్కుతుందని కాంగ్రెస్‌ పెద్దలు స్పష్టం చేశారు. దీంతో కరీంనగర్‌ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌ నేతలందరూ వారం రోజులుగా ఆ దిశగా పని చేస్తున్నారు. గత వారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ గౌడ్‌ నేతృత్వంలో ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కంటెస్టెడ్‌ ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చకు వచ్చిన పలు అంశాలు జిల్లా రాజకీయాల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా పోలీసు, రెవెన్యూ, ఇతర విభాగాల్లో పనిచేసే కీలక అధికారులను మార్చాలని, వారు తమకు సహకరించడం లేదని పలువురు ఎమ్మెల్యేలు ఫిర్యాదులు చేయడంపై ఆయా డిపార్ట్‌మెంట్లలో చర్చ జరుగుతోంది.

**సీపీ, ఎస్పీలను మార్చాల్సిందే..**

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కరీంనగర్‌ సీపీ అభిషేక్‌ మహంతి, సిరిసిల్ల ఎస్పీ అఖిల్‌ మహాజన్‌లను మార్చాల్సిందేనని ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మరోసారి కరీంనగర్‌ సీపీ అభిషేక్‌ మహంతి విషయాన్ని లేవనెత్తారు. ఆయన ఏమాత్రం సహకరించడం లేదని, తప్పించాలని పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల సీపీపై కవ్వంపల్లి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అదే సమయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సీపీ మహంతి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. ఇక, సిరిసిల్ల ఎస్పీ అఖిల్‌ మహాజన్‌పై ప్రభుత్వ విప్‌, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ అసంతృప్తి వ్యక్తం చేశారు. విషయం బయటకు రావడంతో పోలీస్‌ డిపార్ట్‌మెంట్‌లో చర్చనీయాంశమైంది. హోంశాఖ సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉండటంతో ఏ నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ నెలకొంది.

- బీఆర్‌ఎస్‌ హయాంలో జగిత్యాల జిల్లాలో నియమితులైన పలువురు అధికారులు ఎమ్మెల్యేలకు ఏమాత్రం సహకరించడం లేదని ప్రభుత్వ విప్‌, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ ఆరోపించారు. రుణమాఫీ, రేషన్‌ కార్డుల ప్రక్రియ వేగిరం చేయాలని కోరారు.
- ప్రభుత్వం చేస్తున్న అనేక పనులను మరింత సమర్థంగా చెప్పుకోవాల్సిన అవసరం ఉందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అభిప్రాయపడ్డారు.

**ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కినుక..**

ఎమ్మెల్సీ జీవన్‌ రెడ్డి సమావేశానికి హాజరయ్యారు. ప్రస్తుతం కరీంనగర్‌ నుంచి పట్టభద్రుల స్థానానికి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ, ఆయన పేరు సమావేశ జాబితాలో లేకపోవడంతో బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. పొరపాటును గుర్తించిన పీసీసీ చీఫ్‌ మహేశ్‌కుమార్‌గౌడ్‌.. వెంటనే జీవన్‌రెడ్డికి సర్ది చెప్పారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన నేపథ్యంలో ఆయన పేరు నిజామాబాద్‌ జిల్లాలో ఉందని తెలిపారు. ఈ సమావేశానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ హాజరవడంపైనా జీవన్‌రెడ్డి కినుక వహించారని సమాచారం. ఈ రెండు విషయాల్లో ఎమ్మెల్సీ, ఆయన అనుచరులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

**ఇక మంత్రుల వరుస పర్యటనలు!**

ఈ సమావేశానికి హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ విజయబావుటా ఎగురవేస్తుందని చెప్పారు. రామగుండం, కరీంనగర్‌ కార్పొరేషన్లను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అదే సమయంలో ఇన్‌చార్జి మంత్రి ప్రతీ నెల రివ్యూలు చేపట్టాలని, 15 రోజులకోసారి ఏదైనా నియోజకవర్గంలో పర్యటించాలని పీసీసీ చీఫ్‌ మహేశ్‌కుమార్‌ గౌడ్‌ సూచించారు. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులతోపాటు ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి అన్ని నియోజకవర్గాల్లో వరుస పర్యటనలకు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ఒడ్డెలింగాపూర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్‌ సత్యప్రసాద్‌

**కలెక్టర్‌ సత్యప్రసాద్‌**

జగిత్యాల: పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని కలెక్టర్‌ సత్యప్రసాద్‌ అన్నారు. బుధవారం స్వచ్ఛతాహీసేవా కార్యక్రమంలో భాగంగా లీడ్‌ బ్యాంక్‌ ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభించారు. జిల్లాను పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారని, రోడ్లపై ఎవరూ చెత్తవేయవద్దని, విష జ్వరాలు వ్యాపించే అవకాశం ఉంటుందని సూచించారు. లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌ రాంకుమార్‌, డీఆర్డీఏ పీడీ రఘువరణ్‌, డీడబ్ల్యూవో నరేశ్‌, ఆర్డీవో మధుసూదన్‌, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**వయోవృద్ధులకు సహకరించాలి**

వయోవృద్ధులకు సహకరించాలని కలెక్టర్‌ అన్నారు. వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. వృద్ధుల ఆరోగ్య రక్షణతోపాటు సామాజిక భద్రత కల్పిస్తామన్నారు.

**మెరుగైన వైద్యసేవలందించాలి**

రాయికల్‌: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలందించాలని కలెక్టర్‌ వైద్యులకు సూచించారు. మండలంలోని ఒడ్డెలింగాపూర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ల్యాబ్‌రికార్డులు, ఓపీ సేవలు, మెడికల్‌ ఫార్మసీని పరిశీలించారు. మలేరియా, డెంగీ ప్రబలుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండేందుకు ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యసేవలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్‌, తహసీల్దార్‌ ఖయ్యూం, ఎంపీడీవో చిరంజీవి, మెడికల్‌ ఆఫీసర్‌ సతీశ్‌ ఉన్నారు.

## అట్రాసిటీ కేసుల పరిహారం సకాలంలో అందించాలి

- బాధితులకు అండగా నిలవాలి
- ప్రభుత్వ విప్‌ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌



అధికారులతో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌

జగిత్యాల: ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిహారం సకాలంలో అందించాలని, బాధితులకు అండగా నిలవాలని ప్రభుత్వ విప్‌ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి విజిలెన్స్‌ అండ్‌ మానిటరింగ్‌ కమిటీ సమావేశం జరిగింది. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇది మొదటి సమావేశమని, కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. జిల్లాలో వివిధ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆర్థికంగా చిన్న కుటుంబాల వారు ఉంటారని, పోలీసు యంత్రాంగం వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రత్యేక నిధులు జిల్లాకు తీసుకొస్తానన్నారు. కలెక్టర్‌ సత్యప్రసాద్‌ మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు, ఆయా కేసుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్‌, సంజయ్‌, ఆర్డీవో మధుసూదన్‌, డీఎస్పీలు పాల్గొన్నారు.

**సన్నబియ్యం పంపిణీపై కసరత్తు**

బుగ్గారం: రేషన్‌ కార్డుదారులకు త్వరలో సన్నబియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని విప్‌ అడ్లూరి అన్నారు. బుగ్గారం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పలువురికి మంజూరైన కళ్యాణలక్ష్మీ చెక్కులను అందించారు. మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణం ప్రారంభమైందని, త్వరగా పూర్తిచేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. తహసీల్దార్‌ మాజిద్‌, ఎంపీడీవో శ్రీనివాస్‌, స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## జాబితాపూర్‌ పాఠశాలను పరిశీలించిన జెడ్పీ మాజీ చైర్‌పర్సన్‌



మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్‌ వసంత

జగిత్యాలరూరల్‌: జగిత్యాలరూరల్‌ మండలం జాబితాపూర్‌ జిల్లా పరిషత్‌ పాఠశాలలో ‘139 మంది విద్యార్థులకు ఒకటే మూత్రశాల’ శీర్షికన ‘సాక్షి’లో బుధవారం ప్రచురితమైన కథనానికి మాజీ ఎంపీ, నిజామాబాద్‌ పట్టభద్రుల ఎమ్మెల్సీ కవిత చలించిపోయారు. పాఠశాలను సందర్శించాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్‌ దావ వసంతను ఫోన్‌లో సూచించారు. దీంతో వసంత పాఠశాలకు వెళ్లి వసతులపై ఆరా తీశారు. విద్యార్థులకు తక్షణమే టాయిలెట్స్‌ నిర్మాణం చేపట్టాలని సూచించారు. సాక్షిలో వచ్చిన కథనాన్ని చూసి ఎమ్మెల్సీ కవిత చలించిపోయారని, విద్యార్థులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. జాబి తాపూర్‌ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి గతంలో రూ.10 లక్షలు కేటాయించామని, వాటిని ఇప్పటి ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీ పేరుతో రద్దు చేసిందని విమర్శించారు. వ్యక్తిగత అభివృద్ధి కోసం పార్టీ మారిన స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి కోసమని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్‌ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు కేసీఆర్‌ రూ.27 వేల కోట్లు వెచ్చించారని గుర్తు చేశారు. ఆమె వెంట పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు జలేందర్‌, నాయకులు చిత్తారి శ్రీనివాస్‌, పడిగెల గంగారెడ్డి, లక్ష్మణ్‌, బుర్ర ప్రవీణ్‌గౌడ్‌, సురేశ్‌, శేఖర్‌గౌడ్‌ పాల్గొన్నారు.

## పాఠశాలల్లో వసతులు మెరుగుపరుస్తాం



విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్‌: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని బల్దియా చైర్‌పర్సన్‌, కమిషనర్లకు సూచించారు. కార్యక్రమంలో బల్దియా చైర్‌పర్సన్‌ అడువాల జ్యోతి, కమిషనర్‌ సమ్మయ్య, బండ శంకర్‌, ఎలిగేటి నర్సయ్య, గుగ్గిళ్ల హరీశ్‌, గుండ మధు, అధికారులు ఉన్నారు.

## విధుల పట్ల అవగాహన పెంచుకోవాలి

- ఎస్పీ అశోక్‌కుమార్‌ వెల్లడి
- పోలీస్‌ డ్యూటీమీట్‌ ప్రారంభం



డ్యూటీలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ అశోక్‌

జగిత్యాలక్రైం: పోలీసు శాఖలో అన్ని విధుల పట్ల సిబ్బంది అవగాహన పెంచుకోవాలని ఎస్పీ అశోక్‌ కుమార్‌ సూచించారు. రాష్ట్రంలోనే మొదటిసారి పోలీస్‌ డ్యూటీ మీట్‌ను బుధవారం ప్రారంభించిన ఆయన మాట్లాడారు. సరైన ఆధారాలతోనే నేర దర్యాప్తు సాధ్యమన్నారు. పోలీసు అధికారులు, సిబ్బందికి కంప్యూటర్‌, ఫొరెన్సిక్‌, ఫింగర్‌ ప్రింట్స్‌, హ్యాండ్లింగ్‌, లిఫ్టింగ్‌, ప్యాకింగ్‌, బాంబు డిస్పోజల్‌ స్క్వాడ్‌, పోలీసు జాగిలాలు, ట్రాకింగ్‌ ఎక్స్‌క్లూజివ్‌ విభాగాల్లో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ పోటీలు నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల దర్యాప్తు చేసేందుకు పోలీసు డ్యూటీ మీట్‌ దోహదపడుతుందన్నారు. జాతీయస్థాయిలో జరిగే డ్యూటీ మీట్‌ విజేతలకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. అడిషనల్‌ ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రవీందర్‌కుమార్‌, రంగారెడ్డి, సీఐలు శ్రీనివాస్‌, రఫీక్‌ఖాన్‌, లక్ష్మీనారాయణ, రాంనర్సింహారెడ్డి, రవి, సురేశ్‌, ఆర్‌ఐలు కిరణ్‌కుమార్‌, వేణు, ఎస్సైలు పాల్గొన్నారు.

**అంకిత భావంతో పనిచేయాలి**

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న నలుగురు సివిల్‌, ఏఆర్‌ ఎస్సైలు బుధవారం ఎస్పీని కలిశారు. డిపార్ట్‌మెంట్‌లో క్రమశిక్షణతో మెలగాలని, విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు.

## పొలిటికల్‌ అనుమతులు

- భవన నిర్మాణాలపై మితిమీరిన ప్రజాప్రతినిధుల జోక్యం
- పెద్ద సంఖ్యలో అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం
- మున్సిపాలిటీ ఆదాయానికి భారీ గండి



మెట్‌పల్లి: మెట్‌పల్లి మున్సిపాలిటీలో భవన నిర్మాణాల విషయంలో ప్రజాప్రతినిధులు, నాయకుల జోక్యం మితిమీరిపోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టౌన్‌ప్లానింగ్‌ విభాగం పర్యవేక్షణలో భవనాల అనుమతులు, నిర్మాణాలు జరగాల్సి ఉండగా.. పూర్తిగా వారి కనుసన్నల్లోనే జరుగుతుండడం ఇబ్బందిగా మారింది. మున్సిపాలిటీ నుంచి అనుమతి ఉన్నా.. లేకపోయినప్పటికీ వారి అనుమతి మాత్రం తప్పనిసరిగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వారి వైఖరితో ఒకవైపు మున్సిపల్‌ ఆదాయానికి గండి పడుతుండగా.. మరోవైపు ఇక్కడి టౌన్‌ ప్లానింగ్‌ విభాగానికి బదిలీపై రావడానికి ఇతర మున్సిపాలిటీల నుంచి ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో చాలాకాలంగా ఖాళీలు భర్తీకి నోచుకోవడం లేదు.

- ఈ చిత్రం మెట్‌పల్లి పట్టణంలోని జాతీయ రహదారి పక్కన నిర్మిస్తున్న షెడ్డు. వ్యాపారం కోసం ఏర్పాటు చేస్తున్న ఈ షెడ్డుకు మున్సిపల్‌ నుంచి ఎలాంటి అనుమతులూ తీసుకోకుండానే పనులు చేపట్టారు. ఈ విషయాన్ని కొన్నిరోజుల క్రితం దీ‘సాక్షి’ వెలుగులోకి తీసుకొచ్చింది. అలాగే పలువురు ఫిర్యాదు చేయడంతో టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు పనులు ఆపాలని సదరు స్థల యజమానికి నోటీసు ఇచ్చారు. అయినా నిర్మాణం పూర్తి చేసుకున్నాడు. అందులో త్వరలోనే వ్యాపారం ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఈ నిర్మాణం వెనుక ఓ మహిళ ప్రజాప్రతినిధి భర్త అండదండలు ఉన్నట్లు విమర్శలున్నాయి. ఆయన తీరుతో మున్సిపాలిటీకి అనుమతి ఫీజు కింద రావాల్సిన ఆదాయాన్ని కోల్పోవడం గమనార్హం. ఇలా ఈ ఒక్కటే కాదు.. పలు వార్డుల్లో నాయకులు తమ ప్రయోజనాల కోసం అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ మున్సిపల్‌ ఆదాయానికి గండి కొడుతున్నారు.



**కాసులు కురిపిస్తున్న కొన్ని వార్డులు**

- పట్టణంలో 26 వార్డులున్నాయి. శివారు వార్డుల్లో పెద్ద సంఖ్యలో నిర్మాణాలు జరుగుతున్నాయి.
- మహిళాకౌన్సిలర్లు ఉన్నచోట వారి భర్తల కనుసన్నల్లో నిర్మాణాలు జరుగుతున్నాయన్నది బహిరంగ రహస్యం.
- వీటిల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా వారి జేబులు మాత్రం నింపాల్సిందే. లేనిపక్షంలో పనులకు ఆటంకం కలిగిస్తారనే ఆరోపణలున్నాయి.
- వీరి అండతో ఆయా వార్డుల్లో చాలామంది మున్సిపల్‌ నుంచి అనుమతులు పొందకుండానే భవనాలు, రేకులతో భారీ షెడ్లు నిర్మిస్తున్నారు.
- ఒక్కో భవనం అంతస్తును బట్టి రూ.10వేలు మొదలు రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

**అధికారులు నోటీసులకే పరిమితం**

- వార్డుల్లో అక్రమ నిర్మాణాలను గుర్తిస్తున్న టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు.. వారికి నోటీసులు ఇస్తున్నారే తప్ప తదుపరి ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.
- అక్రమ నిర్మాణాలను అరికట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది.
- ముఖ్యంగా ప్రతి మున్సిపాలిటీలో తహసీల్దార్‌ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ టీంను ఏర్పాటు చేసింది.
- ఈ టీంలు ఎప్పటికప్పుడు నిర్మాణాలను పరిశీలించి అక్రమమని తేలితే వెంటనే వాటిని తొలగించాల్సి ఉంటుంది.
- అయితే రాజకీయ ఒత్తిళ్లతో వారు ఎలాంటి చర్యలూ తీసుకోకుండా మిన్నకుండిపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

**నోటీసులు ఇస్తున్నాం**

జాతీయ రహదారి పక్కన అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తున్న షెడ్డు పనులు నిలిపివేయాలని రెండుసార్లు నోటీసులు ఇచ్చాం. సిబ్బంది కొరతతో తగిన చర్యలు తీసుకోలేకపోతున్నాం. అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపడితే ఎప్పటికైనా ఇబ్బందులు తప్పవు. – రాజేంద్రప్రసాద్‌, టీపీఎస్‌

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలి**

- మున్సిపాలిటీకి ఎక్కువ ఆదాయం టౌన్‌ ప్లానింగ్‌ విభాగం నుంచి సమకూరే అవకాశముంటుంది.
- అయితే పెద్ద సంఖ్యలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల వల్ల రూ.లక్షల్లో ఆదాయానికి గండి పడుతున్నట్లు తెలుస్తోంది.
- ప్రస్తుతం మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.
- ఈ నేపథ్యంలో ప్రతి నిర్మాణం నుంచి వచ్చే ఆదాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
- ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణాల విషయంలో ప్రజాప్రతినిధుల జోక్యాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**అక్రమాలకు కొన్ని ఉదాహరణలు..**

- ఏడో వార్డులో కౌన్సిలర్‌ ఇంటి సమీపంలో ఓ వ్యాపారి సెట్‌బ్యాక్‌ వదలాలనే నిబంధన పాటించకుండా భారీ కమర్షియల్‌ కాంప్లెక్స్‌ నిర్మిస్తున్నాడు.
- 19 వార్డులో జాతీయ రహదారి పక్కన కమర్షియల్‌ కాంప్లెక్స్‌ నిర్మాణం కోసం సెల్లార్‌, మూడు అంతస్తులకు అనుమతి తీసుకున్నారు. ప్రస్తుతం అదనంగా మరో అంతస్తు నిర్మిస్తున్నారు.
- ఐదో వార్డులో జాతీయ రహదారి పక్కన మూడు అంతస్తులకు అనుమతి తీసుకుని అదనంగా మరో అంతస్తు నిర్మిస్తున్నారు. ఈ అనుమతులు కూడా పంచాయతీ హయాంలో తీసుకున్నట్లు తెలిసింది.
- 11 వార్డు శివారులో జాతీయ రహదారి పక్కన పలుచోట్ల అనుమతులు పొందకుండానే కమర్షియల్‌ షెడ్లు నిర్మించారు.

## న్యూస్‌రీల్‌

### నృసింహుడి హుండీ ఆదాయం రూ.47.70 లక్షలు



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామికి హుండీల ద్వారా రూ. 47,70,995 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్‌ తెలిపారు. ఈ ఏడాది జూన్‌ 12 నుంచి ఈనెల 25 వరకు (105 రోజులు) వచ్చిన హుండీ లెక్కింపును ఆలయ ప్రాంగణంలో బుధవారం లెక్కించారు. రూ.47.70లక్షలతోపాటు 50 గ్రాములు మిశ్రమ బంగారం, 4.700కిలోల మిశ్రమ వెండి, 90 విదేశీనోట్లు సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్‌ సుప్రియ, సూపరింటెండెంట్‌ కిరణ్‌కుమార్‌, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తదితరులున్నారు.


### ఎమ్మెల్యే డ్రైవింగ్‌ లైసెన్స్‌ రెన్యువల్‌



కార్యాలయంలో సంతకం చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్‌: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ బుధవారం జగిత్యాలరూరల్‌ మండలం తాటిపల్లిలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో తన డ్రైవింగ్‌ లైసెన్స్‌ను రెన్యువల్‌ చేయించుకున్నారు. వాహనదారులు హెల్మెట్‌ తప్పనిసరి వాడాలని, వాహనాలకు ఫిట్‌నెస్‌, రిజిస్ట్రేషన్‌, పొల్యూషన్‌, ఇన్సూరెన్స్‌ పత్రాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌, ఎంవీఐలు రామారావు, వెంకన్న, ప్రమీల, నాయకులు న్యాదెం శంకర్‌, అంజన్న, గంగారెడ్డి, శ్రీకాంత్‌, గిరి పాల్గొన్నారు.

### ఎస్సారెస్పీ రెండు గేట్ల ఎత్తివేత



దిగువకు విడుదలవుతున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్‌: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తుండటంతో బుధవారం రెండు గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలారు. వరదకాలువకు 15 వేల క్యూసెక్కుల నుంచి 18 వేల క్యూసెక్కులకు పెంచారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 33,238 క్యూసెక్కుల వరద వస్తోంది. కాకతీయ మెయిన్‌ కెనాల్‌కు 6,800 క్యూసెక్కులు, లక్ష్మీ కెనాల్‌కు 50, మిషన్‌ భగీరథకు 231, ఎస్కేప్‌ ద్వారా 1200 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



దుంపేటలో అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్‌ రాష్ట్ర అధికారుల బృందం

కథలాపూర్‌(వేములవాడ): కథలాపూర్‌ మండలం సిరికొండ, దుంపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్‌ రాష్ట్ర అధికారుల బృందం రాహుల్‌, రావణ్‌ బుధవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పౌష్టికాహారం నిల్వలు, రికార్డులను పరిశీలించారు. చిన్నారుల బరువులను తూకం వేసి ఎత్తుకు తగిన బరువు తీసి పోషణ స్థితిని గమనించి అంగన్‌వాడీ టీచర్లకు సూచనలిచ్చారు. ఆట, పాటల ద్వారా చిన్నారులకు బోధిస్తున్న తీరును పరిశీలించారు. వారి వెంట జిల్లా సంక్షేమశాఖ అధికారి నరేశ్‌, ఈవో పవిత్ర, జిల్లా పోషణ్‌ అభియాన్‌ కో–ఆర్డినేటర్‌ మధుకుమార్‌, సీడీపీవో మణెమ్మ, వీసీ ప్రశాంత్‌ ఉన్నారు.

### పరిహారంలో అన్యాయం చేయొద్దు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జువ్వాడి

మెట్‌పల్లిరూరల్‌: రహదారి బైపాస్‌ నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి అన్యాయం జరగనీయొద్దని కాంగ్రెస్‌ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కలెక్టర్‌ సత్యప్రసాద్‌ను కోరారు. రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న మేడిపల్లి, వెల్లుల్ల, బండలింగాపూర్‌ రైతులతో కలిసి కలెక్టర్‌ను కలిశారు. భూములు కోల్పోతున్న వారికి బహిరంగ మార్కెట్‌ ధర ప్రకారం పరిహారం వచ్చేలా చూడాలన్నారు.

## క్లుప్తంగా

### కొడిమ్యాలలో అదనపు కలెక్టర్ తనిఖీలు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల ఎంపీడీవో కార్యాలయాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి బుధవారం సందర్శించారు. రిజిస్టరు, రికార్డులు తనిఖీ చేశారు. నీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయించాలన్నారు. బ్లీచింగ్ చల్లాలని, ట్యాంకులను శుభ్రం చేయాలని పేర్కొన్నారు.

### పొగాకుతో క్యాన్సర్ వచ్చే ప్రమాదం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సమియోద్దీన్

జగిత్యాల: పొగాకు ఉత్పత్తుల (ఖైని, జర్దా, బీడీ, చుట్ట)తో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని డీఎంహెచ్‌వో సమియోద్దీన్ అన్నారు. బుధవారం మోతెవాడలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో యువత, ప్రజలకు అవగాహన కల్పించారు. పొగాకు వినియోగించే వారు మానుకోవాలని, వాడితే విపరీతమైన అనారోగ్య సమస్యలు, నోరు, గొంతు, ఊపిరితిత్తులకు క్యాన్సర్ వంటి రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. చిన్నపిల్లలు వీటిని అలవాటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, అర్చన, జైపాల్‌రెడ్డి, స్వాతి, భూమేశ్వర్ పాల్గొన్నారు.

### శాస్త్రీయ పద్ధతిలో సాగు చేయాలి



అల్లీపూర్‌లో అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వాణి

రాయికల్: రైతులు శాస్త్రీయ పద్ధతిలో సాగుచేస్తే అధిక దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి వాణి అన్నారు. బుధవారం రాయికల్ మండలం అల్లీపూర్‌లో గ్రామీణ కృషి మౌసమ్ సేవ పథకంలో భాగంగా క్షేత్రపర్యటన చేపట్టారు. శాస్త్రవేత్తలు వాతావరణంలో వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తున్నారని, శాస్త్రవేత్తల సూచనల మేరకు సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రజిని, సాయికుమార్, వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ పాల్గొన్నారు.

### రెండోరోజూ కొనసాగిన ఎస్జీఎఫ్ పోటీలు



విజేతలతో బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి తదితరులు

జగిత్యాలటౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని వికానంద మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రీడాపోటీలు బుధవారం కొనసాగాయి. క్రీడాకారులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ క్రీడాకారులకు భోజనం వడ్డించారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కార్యదర్శి లక్ష్మీరాం, పెటా అధ్యక్షుడు పడాల విశ్వప్రసాద్, కార్యదర్శి అశోక్, పీడీలు పడాల కృష్ణప్రసాద్, అజయ్‌బాబు, వెంకటలక్ష్మి, మల్లీశ్వరి, శ్రీనివాస్, భాస్కర్, వేణు పాల్గొన్నారు.

# కోతులు.. చిలుకలు.. అడవి పందులు

- కుటుంబమంతా తోటల వద్ద పహారా
- చేను చుట్టూ సోలార్ కంచెలు ఏర్పాటు
- చెట్లకు మైకులు కట్టి భారీ శబ్దాలు

జగిత్యాలఅగ్రికల్చర్: రైతన్నలు రాత్రింబవళ్లు కష్టపడి పంట పండించడం ఒక ఎత్తైతే.. ఆ పంటను కోతులు, అడవిపందులు, రామచిలుకల నుంచి కాపాడటం మరో ఎత్తుగా మారింది. జిల్లాలో దాదాపు 50వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగువుతోంది. ఆ పంట ప్రస్తుతం గింజదశకు చేరుకుంది. ఈ క్రమంలో పంటను అడవిపందులు, కోతులు, రామచిలుకలు నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు ఉదయం నుంచి రాత్రి వరకు పహరా కాస్తున్నారు. అడవి జంతువులను వెళ్లగొట్టేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. కొంతమంది సోలార్ కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. మరికొంత మంది తోటచుట్టూ ఉన్న చెట్లకు మైక్‌లు పెట్టి శబ్దాలు చేస్తున్నారు. ఇంకొందరు కుక్కలను తోటల వద్దే ఉంచుతున్నారు.



రాయికల్‌లో చిలుకలపై రాళ్లు విసురుతున్న రైతు

జిల్లాలో తొలకరి వర్షాలు కురవగానే పెసర, మొక్కజొన్న, వేరుశెనగ వంటి పంటలు వేసేవారు. కొంత కాలంగా కోతుల బెడద ఎక్కువ కావడంతో వేరుశెనగ, పెసర పంటలను తగ్గించారు. మొక్కజొన్న పంట గింజదశకు చేరుకున్న తర్వాత రామచిలుకలు తింటున్నాయి. అడవి పందులైతే నిమిషాల్లోనే నాశనం చేస్తున్నారు. ఇక కోతుల గురించి ప్రత్యేకంగా చెప్పనలవి కావడం లేదు. ఇవన్నీ కలిసి రైతులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. జిల్లాలో ఎక్కువగా గుట్టలు ఉన్న ప్రాంతం కావడంతో మొక్కజొన్న పంట వేయాలంటేనే రైతులు భయపడే పరిస్థితి నెలకొంది.

#### ధ్వంసం చేసేది ఎక్కువ

కోతులు గుంపులుగుంపులుగా వచ్చి ప్రతి మొక్కజొన్న కంకిని బూరు తీసి చూస్తుంటాయి. కంకిలో గింజలు లేకపోతే వదిలేస్తుంటాయి. కర్ర మొదలు కొరికి నాశనం చేస్తుంటాయి. రామచిలుకలను ఓ వైపు వెళ్లగొడితే.. చేనుకు మరోవైపు వాలుతున్నాయి. కంకులను చీరేస్తున్నాయి. అడవి పందులు గుంపులుగా వచ్చి తినడం కంటే ఎక్కువ తోటను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో గింజకు వచ్చిన మొక్కజొన్నను కాపాడుకునేందుకు రైతులు ఉదయం నుంచి రాత్రి వరకు కాపలా కాయాల్సిన పరిస్థితి. కొందరు రైతులు మంచెలు ఏర్పాటు చేసుకుని రాత్రివేళ మంటలు పెడుతున్నారు.



మొక్కజొన్న తోట వద్ద కాపలాగా ఉన్న కుక్కలు

#### తంటాలు పడుతున్న రైతులు

చాలా గ్రామాల్లో రైతులు తోటల నుంచి అడవి జంతువులను తరిమేందుకు రూ.50వేల వరకు ఖర్చుపెట్టి సోలార్ కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ కోతులు వాటిని దాటుకుని చేనులోకి ప్రవేశిస్తున్నాయి. కోతులను తరిమేందుకు చాలా గ్రామాల్లో రైతులు కుక్కలను పెంచుతున్నారు. మరికొంత మంది కుక్కలు అరిచినట్లుగా రికార్డు చేసి చెట్లకు మైక్‌లు కడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో టపాకాయలు కాల్చుతున్నారు. పంటలను కోతుల నుంచి కాపాడుకునేలా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలని, ప్రభుత్వం ఆలోచన చేయాలని రైతులు కోరుతున్నారు.



సారంగాపూర్‌లో అడవిపందుల కోసం చెట్లకు కట్టిన మైక్‌సెట్లు

#### కాపలా ఉంటున్నా



రెండెకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. కోతులు గుంపులుగుంపులుగా వస్తున్నాయి. నెలరోజులుగా కుటుంబసభ్యులమంతా కాపలా ఉంటున్నాం. రామచిలుకలు విపరీతంగా వాలుతున్నాయి. పంటను కాపాడటం కష్టంగా మారింది. మరో నెలరోజులు కాపలా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– నక్కల తిరుపతి రెడ్డి, తొంబరావుపేట, మేడిపల్లి

#### అడవి పందులతో ధ్వంసం



కోతులే కాకుండా అడవి పందులు మొక్కజొన్న పంటను ధ్వంసం చేస్తున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ రోజంతా కాపలా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోలార్ కంచె ఏర్పాటు చేసినప్పటికీ కోతులు, అడవి పందులు వస్తున్నాయి. పంట చేతికి వచ్చేవరకు తోటల వద్దనే ఉంటున్నాం.

– కాలగిరి సత్యనారాయణ రెడ్డి, సారంగాపూర్

# ఎస్జీఎఫ్‌కు నిధుల కొరత

- దాతలు ఇచ్చే నిధులతోనే విజేతలకు బహుమతులు
- భోజనం కోసం క్రీడాకారుల అగచాట్లు
- పీఈటీలపై పడుతున్న క్రీడాపోటీల భారం

జగిత్యాలజోన్: ఏటా జిల్లాల్లో నిర్వహించే ఎస్జీఎఫ్, అసోసియేషన్ క్రీడలను అత్తెసరు నిధులతో నెట్టుకు రావాల్సిన దుస్థితి నెలకొంది. క్రీడల ప్రారంభం, ముగింపు సమావేశాల్లో పాల్గొనే ప్రజాప్రతినిధులకు నిధుల లేమి సమస్య కనబడినా స్పందించడం లేదు. దీంతో క్రీడాకారులకు కనీసం భోజన వసతి కూడా కల్పించలేని పరిస్థితి ఏర్పడింది. విజేతలకు బహుమతులు ఇవ్వాలంటే దాతల కోసం వెతకాల్సిన దుస్థితి నెలకొంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ వంటి ఆటలను అండర్‌–14, అండర్‌–17 స్థాయిలో బాల, బాలికలకు వేర్వేరుగా నిర్వహిస్తారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను మండలస్థాయికి పంపిస్తారు. ఇలా జిల్లాలో మండల స్థాయి క్రీడలను ఈనెల 18వరకు ముగించారు. అక్కడ రాణించిన విద్యార్థులను జిల్లాస్థాయికి తీసుకొచ్చారు. ప్రస్తుతం జిల్లాస్థాయి క్రీడలు జిల్లాకేంద్రంలోని మినీ స్టేడియంలో ఈనెల 24 నుంచి ప్రారంభించారు. పోటీలు ఈనెల 28వరకు నిర్వంచనున్నారు. అయితే ఈ క్రీడలకు ప్రభుత్వం పెద్దగా నిధులు విడుదల చేయలేదు. ఒక్కో మండలానికి రూ.4వేల చొప్పున డీఈవో ద్వారా అందించింది. ఇలా జిల్లాలోని 20 మండలాలకు కలిపి రూ.80వేల వరకు వచ్చే నిధులు, సున్నం, విజిల్స్, ఆట వస్తువులకే సరిపోతున్నాయి. జిల్లాస్థాయి క్రీడలకు కనీసం వెయ్యి మంది విద్యార్థులు వస్తే వారి భోజనానికే రూ.50వేల వరకు ఖర్చవుతాయి. ఈ లెక్కన పోటీలు నిర్వహించే నాలుగు రోజులకు కలిపి ఎంత లేదనుకున్నా రూ.2.50లక్షల వరకు ఖర్చవుతుంది. ఈ లెక్కన పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడలకు కనీసం రూ.5 లక్షల నుంచి రూ.6లక్షలు ఇవ్వాలని చేస్తున్న విజ్ఞప్తులు బుట్టదాఖలవుతూనే ఉన్నాయి.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

#### దాతలతోనే క్రీడకారులకు భోజన వసతి

క్రీడకారులకు టీ షర్ట్స్, నెక్కర్ కొనుగోలు, రవాణా, భోజన వసతిని విద్యార్థులే సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పీఈటీల అసోసియేషన్ ప్రాదబలంతో పీఈటీలపై ఉన్న నమ్మకంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి, వాహనాలు సమకూర్చుతున్నారు. మరోవైపు ప్రధానోపాధ్యాయులు చేతులెత్తేస్తున్నారు. ఆటలపై ఆసక్తి ఉన్న పీఈటీలు తమ సొంత ఖర్చులతో విద్యార్థులను ఆటలకు తీసుకెళ్తున్నారు.


#### నిధులు పెంచాలి



విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఉండేందుకు క్రీడలు తప్పనిసరి. అలాంటి క్రీడల నిర్వహణకు చాలీచాలని నిధులు ఇస్తుండటంతో నిర్వహణ కష్టంగా మారింది. ఏటా రెండుసార్లు క్రీడలు నిర్వహించేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తే మెరికల్లాంటి క్రీడాకారులు తయారవుతారు.

– పి.విశ్వప్రసాద్, జిల్లా పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

#### రావడమే ఇబ్బంది



ఆటల ద్వారా చదువుల్లో ముందుంటున్నాం. పోటీలకు రావడమే ఇబ్బందిగా ఉంటోంది. భోజనం ఉంటుందో..? ఉండదో..? ఎవరికీ తెలియదు. మల్యాల నుంచి ఆటలు ఆడేందుకు వ్యాన్ మాట్లాడుకుని వచ్చాం. వచ్చేటప్పుడు కొన్ని డబ్బులు వెంట తెచ్చుకుంటున్నాం. మాలాంటి క్రీడాకారుల కోసం డబ్బులు ఇవ్వకపోవడం సరికాదు. భోజన వసతి లేకుంటే ఎలా..?

– మణిదీప్, మల్యాల

## డీ–52 కాలువ ద్వారా 14 గ్రామాలకు సాగునీరు



మైతాపూర్‌లో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో డీ–52 కెనాల్‌కు తూము ఏర్పాటు చేసి 14 గ్రామాలకు సాగునీరు అందించడం సంతృప్తినిచ్చిందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం రాయికల్ మండలం మైతాపూర్‌లో రాజ్యసభ సభ్యుడు దామోదర్‌రావు రూ.25లక్షల మంజూరు చేయగా వాటితో పలు అభివృద్ధి పనులకు కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డి–52 కెనాల్ తొంబర్‌రావుపేట తూము ఏర్పాటు ద్వారా 14 గ్రామాల్లో సాగునీటి ద్వారా వందలాది ఎకరాల భూములు సస్యశ్యామలం అయ్యాయని, రాయికల్‌లోని పెద్ద చెరువు ద్వారా వేలాది ఎకరాలకు నీరు అందుతుందని పేర్కొన్నారు. పట్టణంలో లైబ్రరీ ఏర్పాటు, ఇటిక్యాలలో పల్లె దవాఖానాను ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటిక్యాలలో పల్లె దవాఖానా ఏర్పాటుకు కృషి చేస్తానని, లైబ్రరీకి రూ.40 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపడతామని పేర్కొన్నారు. అల్లీపూర్‌లో రైతుమిత్ర ఫెడరేషన్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. రైతుల సంక్షేమానికి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కలెక్టర్, విప్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, నాయకులు గన్నె రాజిరెడ్డి, కిషన్‌రావు, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు రవీందర్‌రావు, పడిగెల రవీందర్‌రెడ్డి, కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉపాధిహామీలో పారదర్శకత పాటించాలి



సోషల్ ఆడిట్‌లో పాల్గొన్న జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రఘువరణ్

వెల్గటూర్ : ఉపాధి హామీ పథకంలో పారదర్శకత పాటించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రఘువరణ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 14వ సామాజిక తనిఖీ వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని 30 గ్రామాల్లో రూ.7.33కోట్లతో చేపట్టిన పనులపై ఈనెల 11 నుంచి 20వరకు నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదిక అందించారు. ఆ పనుల్లో జరిగిన అవకతవకలపై ఉపాధి హామీ గ్రామస్థాయి సిబ్బంది, మండల స్థాయి సిబ్బందికి కలిపి రూ.5వేలు జరిమానా విధించారు. రూ.28,952 కూలీలకు రికవరీ రూపంలో గుర్తించారు. ఉపాధిహామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, డీవీవో చిన్నయ్య, ఏవీవో దేవేందర్‌రెడ్డి, ఎస్సార్పీ పాండురంగ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో అనిల్ పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రం కేటాయించాలని కలెక్టర్‌కు వినతి

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో నాబార్డ్ సహకారంతో కొనసాగుతున్న రైతుమిత్ర ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీకి ఈ ఏడాది ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటాయించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలెక్టర్‌కు బుధవారం లేఖ రాశారు. అల్లీపూర్‌లో రెండు వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారని, పంటల దిగుబడి రానున్న దృష్ట్యా డీసీఎంఎస్ ద్వారా ధాన్యం కొనుగోలుకు అనుమతివ్వాలని కోరారు.

## బాలుడి దహన సంస్కారాలు పూర్తి

- జగ్గాసాగర్‌లో సద్దుమణిగిన వివాదం
- మృతుడి తల్లిపై దాడి ఘటనలో పలువురిపై కేసు

మెట్‌పల్లిరూరల్: తల్లి మందలించడంతో ఈనెల 8న ఆత్మహత్యకు పాల్పడి.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌కు చెందిన ఏనుగు ప్రభాస్ (19) దహన సంస్కారాలను బుధవారం కుటుంబసభ్యులు పూర్తిచేశారు. నివాసముంటున్న ఇల్లు, నాలుగెకరాల వ్యవసాయ భూమి తల్లి పేరుపై ఉండడంతో బదలాయింపు జరిగాకే అంత్యక్రియలు చేస్తామని కుటుంబసభ్యులు, కులస్తులు తేల్చి చెప్పిన విషయం తెల్సిందే. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి బాలుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులతో మాట్లాడారు. అంత్యక్రియలు పూర్తిచేయాలని, ఏమైనా సమస్యలుంటే తర్వాత చూసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం కొన్ని నిబంధనలుంటాయని, 36 గంటలు దాటితే తప్పనిసరిగా దహన సంస్కారాలు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పోలీసుల సూచనలతో కార్యక్రమాలు చేశారు. తనకు అప్పులు ఉన్నాయని, తన భార్య పేరిట ఉన్న ఆస్తులు తన పేరున బదలాయింపు చేయాలని మృతుడి తండ్రి పోలీసులను వేడుకున్నాడు. మరోవైపు మృతుడి తల్లిపై దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఎస్సై–1 చిరంజీవి, ఎస్సై–2 రాజు, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్, కోరుట్ల ఎస్సై–2 శ్వేత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మృతుడి తండ్రితో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

#### తల్లి ఉద్యోగం చేయమన్నందుకే..

తన తల్లి ఉద్యోగం చేయాలని మందలించినందుకే తాను ఆత్మహత్య చేసుకున్నట్లు బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వాంగ్మూలం ఇచ్చాడని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు క్లారిటీ ఇచ్చారు. దాని ఆధారంగానే ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు. అందులో ఎలాంటి అనుమానాలకూ తావులేదన్నారు.



### దొంగలకు గంజాయి విక్రయించిన వ్యక్తి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి: దొంగలకు గంజాయి విక్రయించిన ఘటనలో పట్టణ శివారులోని అర్బన్ హౌసింగ్ కాలనీకి చెందిన చందు అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నిరంజన్‌రెడ్డి కథనం ప్రకారం.. ఈ నెల 21న అర్ధరాత్రి సమయంలో బండలింగాపూర్ క్రాసింగ్ వద్ద మక్కజొన్నల లోడ్‌తో వెళ్తున్న ఓ వ్యాన్‌ను ముగ్గురు వ్యక్తులు ఆపి డ్రైవర్‌ను కొట్టారు. అతడి నుంచి సెల్‌ఫోన్‌తోపాటు రూ.5వేల నగదును ఎత్తుకెళ్లారు. డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈనెల 23న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో వారి వద్ద ఉన్న గంజాయి గురించి ప్రశ్నించగా.. దానిని చందు వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పారు. అప్పటినుంచి పరారీలో ఉన్న చందు బుధవారం ఇంటికి వచ్చాడనే సమాచారంతో అక్కడకు వెళ్లి అరెస్ట్ చేశారు. అతని నుంచి 350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చందును పట్టుకున్న ఎస్సైలు అనిల్, చిరంజీవి, రాజు, ఇతర సిబ్బందిని సీఐ అభినందించారు.

### ఎస్సై దాడితోనే ఆత్మహత్యాయత్నం

- బాధితుడి సోదరి వీడియో విడుదల



గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివప్రసాద్

జగిత్యాలక్రైం: కోరుట్ల ఎస్సై దాడి చేయడంతోనే తన అన్న ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని బొల్లారపు శివప్రసాద్ సోదరి ప్రశాంతి బుధవారం వీడియో విడుదల చేశారు. జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన శివప్రసాద్ ఈనెల 23న పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెల్సిందే. ఆయన భార్య కుటుంబ కలహాల నేపథ్యంలో కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈనెల 22న కోరుట్ల ఎస్సై శివప్రసాద్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వకుండా చేయిచేసుకున్నారని, తీవ్ర మానసిక వేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆరోపించారు. తన అన్నపై దాడి చేసిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# ‘గ్లోబల్’..పరేషాన్!

- అంతుచిక్కని విద్యాశాఖ తీరు
- నిరుద్యోగుల ఆశలు గల్లంతు

**15 రోజుల క్రితం..**

కోరుట్ల మండలంలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్లోబల్ ఫౌండేషన్ నుంచి తెచ్చుకున్న లెటర్‌తో ఓ నిరుద్యోగి కంప్యూటర్ ఆపరేటర్‌గా విధుల్లో చేరాడు. జగిత్యాల జిల్లాలో ఇలాగే సుమారు 15 మంది వరకు వివిధ ప్రాంతాల్లోని పాఠశాలల్లో చేరి విధులు నిర్వర్తిస్తున్నారు.

**2 రోజుల క్రితం..**

గ్లోబల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థపై కొన్ని ఆరోపణలు ఉన్నాయని, ఆ సంస్థ సిఫారసులతో వచ్చి పాఠశాలల్లో చేరిన వారిని వెంటనే ఉద్యోగాల్లోంచి తొలగించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశించారు. దీంతో ప్రధానోపాధ్యాయులు ఆ వలంటీర్లను తొలగించారు.

కోరుట్ల: హైదరాబాద్‌లోని నాగోల్ చిరునామాతో గ్లోబల్ ఫౌండేషన్ (రిజిస్ట్రేషన్ నంబరు : 1223/2005) అనే ఓ స్వచ్ఛంద సంస్థ ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో వలంటీర్లను నియమించి, వారికి నెలవారీగా రూ.15వేల వేతనం చెల్లిస్తామని విద్యాశాఖ డైరెక్టరేట్‌కు ప్రతిపాదించింది. కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, ఆఫీస్ అసిస్టెంట్లుగా వలంటీర్లను నియమించి తమ సంస్థ నుంచే వేతనాలు చెల్లిస్తామని చెప్పింది. ఈ ప్రతిపాదనపై ఎలాంటి ఆలోచన చేయకుండానే విద్యాశాఖ అధికారులు ఆ ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. అనంతరం గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ వలంటీర్ల నియామకం ప్రక్రియ ప్రారంభించింది. దీనిద్వారా జగిత్యాల జిల్లాలో సుమారు 15 మంది, నిజామాబాద్ జిల్లాలో 11 మంది, కరీంనగర్, పెద్దపల్లి తదితర జిల్లాల్లో మరో 50 మంది వరకు వలంటీర్లను నియమించారు. కంప్యూటర్ ఫ్యాకల్టీ, ఇతర కిందిస్థాయి పోస్టులు ఖాళీగా ఉన్న చోట్ల వలంటీర్లను నియామకం చేస్తూ ఇటీవల లేఖలు జారీ చేసింది. ఈ లేఖలు చూపిస్తూ చాలామంది వలంటీర్లు గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ నుంచి వచ్చామని, పాఠశాలల్లో తమను జాయిన్ చేసుకోవాలని కోరారు. గ్లోబల్ ఫౌండేషన్ ఇచ్చిన లెటర్‌లో విద్యాశాఖ డైరెక్టరేట్ రిఫరెన్స్ నంబర్లు ఉండటంతో కొన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వలంటీర్లను జాయిన్ చేసుకుని జిల్లా విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

#### ఆరోపణలు ఉన్నాయని..

గ్లోబల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థపై వలంటీర్ల నియామకం విషయంలో ఆరోపణలు వస్తున్నాయని చెప్పి రెండురోజుల క్రితం ఆ సంస్థ నుంచి వచ్చిన వలంటీర్లను వెంటనే తొలగించాలని జిల్లా విద్యాధికారులు ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. ఫలితంగా పదిహేను రోజుల పాటు పనిచేసిన వలంటీర్లు ప్రస్తుతం ఉద్యోగాలు ఊడిపోయాయని ఆందోళన చెందుతున్నారు.



గ్లోబల్ ఫౌండేషన్ లెటర్



As per the instructions of the DSE sir, all the HMs are hereby informed that the services of Global Foundation are no longer authorized in schools. Any existing orders or arrangements made by so for availing their services shall be cancelled with immediate effect.

గ్లోబల్ ఫౌండేషన్ సేవలు వద్దని జారీ చేసిన సర్క్యులర్

గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ వలంటీర్ల నియామకానికి డబ్బులు తీసుకుందని ఆరోపణలు వచ్చినట్లుగా విద్యాశాఖ నుంచి సమాచారం ఉన్నట్లుగా కిందిస్థాయి అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బాబర్‌ను వివరణ కోరితే.. తాము వలంటీర్ల నియామకానికి ఒక్క రూపాయి కూడా ఎవరి వద్ద తీసుకోలేదన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఓ వ్యక్తి గ్లోబల్ సంస్థ పేరిట కొంత మంది నిరుద్యోగులకు వలంటీర్లుగా డూప్లికేట్ నియామక లెటర్లు ఇచ్చి మోసగిస్తున్నాడని తమకు తెలిసిందన్నారు. వెంటనే ఆయనపై తాము పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ సమాచారం ఫలితంగా విద్యాశాఖ అధికారులు తామే డబ్బులు తీసుకున్నామన్న అపోహతో వలంటీర్ల నియామకాలను రద్దు చేసిందని వివరించారు. జగిత్యాల జిల్లా విద్యాశాఖాధికారి జగన్మోహన్‌రెడ్డిని వివరణ కోరగా.. గ్లోబల్ ఫౌండేషన్‌కు మొదట విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి వలంటీర్ల నియామకానికి అనుమతి ఇచ్చారన్నారు. అనంతరం కొన్ని ఆరోపణలు రావడంతో వాటిని నిలిపేయాలని ఆదేశించారని తెలిపారు. విద్యాశాఖ నిర్ణయాలతో వలంటీర్లుగా నియమితులై మళ్లీ ఉద్యోగాలు పోగొట్టుకున్న నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారు.